పెండ్లి చేసుకుంటానని నమ్మించి..

వెంగళరావునగర్, మార్చి 12:ప్రేమించానని.. పెండ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతి జీవితంతో చెలగాటమాడాడు ఆ వంచకుడు. ప్రియురాలిని శారీరకంగా పలుమార్లు కలిసిన ఆ మోసగాడు మరో యువతితో పెండ్లికి సిద్ధమై ప్రియురాలికి ముఖం చాటేశాడు ఆ ప్రియుడు. మోసపోయిన బాధిత యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్లో నివాసం ఉండే ఏపీకు చెందిన యువతి నగరంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నది. బాపట్లలోని కాలేజ్‌లో చదువుకునే రోజుల్లో స్నేహితురాలు ఉండేది. రెండేళ్ల కిందట స్నేహితురాలి ద్వారా శ్రీహరి(28)అనే యువకుడు పరిచయమయ్యాడు. ఆ పరిచయం స్నేహంగా మారింది. ప్రేమిస్తున్నానని చెప్పడంతో అతడి ప్రేమను అంగీకరించింది. పెండ్లి చేసుకుంటానని చెప్పిన ప్రియుడు ఓయోతోపాటు.. కాసా హోటల్లో సన్నిహితంగా మెలిగారు. నెల కిందట వైజాగ్ వెళ్తున్నానని చెప్పి శ్రీహరి వెళ్లిపోయాడు. రెండు రోజుల కిందట నగరానికి వచ్చి ప్రియురాలిని కలిశాడు. తనని మర్చిపోవాలని.. సెల్‌ఫోన్‌లో ఓ అమ్మాయి ఫొటో చూపించాడు. ఇంట్లో వారు ఈ అమ్మాయితో పెండ్లికి ఏర్పాట్లు చేస్తున్నారని, తనను మర్చిపోవాలని ప్రియురాలికి చెప్పాడు. ఫోన్లు చేసినా ప్రియుడు శ్రీహరి లిఫ్ట్ చేయడంలేదని.. తనను శారీరకంగా వాడుకుని వదిలేసి తన జీవితాన్ని ప్రియుడు నాశనం చేశాడని బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ర్యాష్ డ్రైవింగ్.. ప్రశ్నించినవ్యక్తిపై దాడి

బంజారాహిల్స్,మార్చి 12: ర్యాష్ డ్రైవింగ్ ఎందుకు చేస్తున్నావని ప్రశ్నించిన ఓ వ్యక్తిని చితకబాదిన ఇద్దరు యువకులపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉంటున్న షేక్ తబ్రేజ్(29) అనే యువకుడు ఈనెల 6న సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వెళ్తున్నాడు. జూబ్లీహిల్స్ రోడ్ నం.5లోకి రాగానే వెనుక నుంచి వచ్చిన బైక్ అకస్మాత్తుగా ర్యాష్ డ్రైవింగ్‌తో దూసుకువచ్చింది. దీంతో స్లోగా వెళ్లవచ్చు కదా.. అంటూ తబ్రేజ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో బైక్ మీద నుంచి దిగిన ఆ ఇద్దరు యువకులు అతడిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు తనపై దాడి చేశారని, వారి దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందానని బుధవారం బాధితుడు తబ్రేజ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బీఎన్ఎస్ 126(2), 115(2), 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కస్టమర్..కేర్‌ఫుల్..!

- నకిలీ కస్టమర్ కాల్ సెంటర్లతో దోపిడీ
- ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తున్నారా? ఇక మీరంతే.. మోసపోవడమే..
- డబ్బులు కోల్పోతున్న బాధితులు

హైదరాబాద్‌లో ఇటువంటి సంఘటనలు వారంలో ఒకట్రెండు జరుగుతున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. కానీ వీటిపై వచ్చే ఫిర్యాదులు మాత్రం తక్కువ. నకిలీ కస్టమర్ కేర్ సెంటర్లకు కాల్స్ చేసి వారి ట్రాప్‌లో పడి డబ్బులు కోల్పోతున్న వారు చాలా మందే ఉంటున్నారు.

సిటీబ్యూరో, మార్చి 12(నమస్తే తెలంగాణ): వారం రోజుల కిందట హైదరాబాద్‌కు చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి గోద్రేజ్ ఎయిర్ కండిషనర్‌ను రిపేర్ చేయించడానికి కస్టమర్ కేర్ నంబర్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశారు. ఓ నంబర్ కనిపించగానే ఫోన్ చేశారు. అవతల వ్యక్తి ఒక లింక్ పంపి అతడి డీటైల్స్ నింపమన్నాడు. బాధితుడు లింక్ ఓపెన్ చేసి తన వివరాలు నింపారు. ఆ తర్వాత అకౌంట్ నిర్ధారించుకోవడానికి రూ.10 పంపమంటే బాధితుడు ఫోన్ కట్ చేశాడు. తెల్లారి చూస్తే తన అకౌంట్ నుంచి 1.9లక్షలు పోయినట్లుగా గుర్తించాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

– తన విమానం టికెట్‌ను క్యాన్సిల్ చేసుకోవాలని ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తున్న ఓ వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించి డబ్బులు కాజేశారు. బంజారాహిల్స్ రోడ్ నం.4లో నివాసం ఉంటున్న ఎం.రాఘవరావు అనే వ్యాపారి ఈనెల 9న తన ఫ్లైట్ టికెట్ క్యాన్సిల్ చేయాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్‌లో కస్టమర్ కేర్ నంబర్ కోసం చూస్తుండగా..ఓ వ్యక్తి ఫోన్ చేసి టికెట్ క్యాన్సిల్ చేసేందుకు వివరాలు తీసుకున్నాడు. టికెట్ వివరాలను, ఫోన్ పే వివరాలు ఇస్తే డబ్బులు అకౌంట్‌లో వేస్తానంటూ చెప్పాడు. దీంతో రాఘవరావు తన ఫోన్‌ను స్క్రీన్ షేర్ ద్వారా ఆగంతకుడికి యాక్సెస్ ఇచ్చాడు. వివరాలు ఇవ్వగానే ఫోన్‌పే ద్వారా రెండు దఫాలుగా రూ.94వేలు కాజేశాడు. దీనిపై బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నకిలీ కస్టమర్ సెంటర్లు..!

ఏసీ, ఫ్రిజ్.. ఇంకా ఏదైనా గృహోపకరణాలు రిపేర్ చేయించాలనుకుంటూ కంపెనీ కస్టమర్ కేర్ సెంటర్ కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతున్నారా..? అయితే జాగ్రత్త. నకిలీగాళ్లు ఉన్నారు. అదే పేరుతో ఫేక్ కస్టమర్ కేర్ సెంటర్ ఉంటుంది. అక్కడి నుంచి కాల్ వస్తుంది. అందులో వారు అడిగిన సమాచారం ఇస్తే.. మీ డబ్బులు పోయినట్లే. ప్రస్తుతం డిజిటల్ మార్కెట్‌ను సైబర్ నేరగాళ్లు టార్గెట్‌గా చేసుకున్నారు. ఆన్‌లైన్ అడ్డాగా అందినంతా దోచేస్తున్నారు. నేరగాళ్లు ప్రముఖ ఈ-కామర్స్ సంస్థల పేరుతో నకిలీ కస్టమర్ సెంటర్లు ఓపెన్ చేస్తున్నారు. ఢిల్లీ, గుర్‌గావ్, కలకత్తా కేంద్రంగా దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడుతున్నారు. ఈ-కామర్స్ సైట్ల ఫేక్ టోల్‌ఫ్రీ నంబర్లు, కస్టమర్ సపోర్ట్ నంబర్లు వెతికే వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఏడాది కాలంలో హైదరాబాద్ సిటీలో సుమారు 220 కేసులు నమోదు కాగా, కస్టమర్లకు సంబంధించిన డబ్బులు సుమారుగా రూ.3కోట్ల వరకు సైబర్ నేరగాళ్ల ఖాతాలోకి వెళ్లాయి. ఈ నేపథ్యంలో ప్రతీయేటా ఫేక్ టోల్‌ఫ్రీ నంబర్ల సంఖ్య భారీగా పెరిగిపోతున్నట్లు సైబర్‌క్రైమ్ పోలీసులు గుర్తించారు. ఆన్‌లైన్ షాపింగ్‌లో కనీస జాగ్రత్తలు పాటించకుండా డిజిటల్ పేమెంట్స్‌లో డబ్బులు కోల్పోతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉన్నా.. ఫిర్యాదు చేయడానికి చాలా మంది ముందుకు రావడంలేదని పోలీసులు చెప్పారు. సైబర్ ఫ్రాడ్స్ ట్రాప్‌లో పడి డబ్బులు కోల్పోతున్న వారిలో కేవలం 45శాతం మంది మాత్రమే ఫిర్యాదులు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రూ.5వేల నుంచి రూ.10వేల వరకే పోగొట్టుకోవడంతో ఫిర్యాదులపై ఆసక్తి కనబర్చడంలేదని, పెద్ద మొత్తంలో డబ్బులు పోయినప్పుడే పోలీసుల వద్దకు వస్తున్నారని వారు చెప్పారు.

అసలు సైట్‌ను తలదన్నేలా..!

సైబర్‌నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్స్ క్రియేట్ చేసి గూగుల్ సెర్చ్‌లో పోస్ట్ చేస్తారు. ఒరిజినల్ సైట్‌ను కూడా గుర్తించలేని విధంగా అక్షరం మార్పుతో తయారు చేస్తుంటారు. కస్టమర్లు సెర్చ్ చేసిన వెంటనే ఒరిజినల్ సైట్‌తోపాటు నకిలీ వెబ్‌సైట్స్ డిస్‌ప్లే అయ్యేలా ప్లాన్ చేస్తారు. ఇలాంటి వెబ్‌పేజీలో తమ నెట్‌వర్క్‌కు సంబంధించిన టెలీకాలర్స్‌ను నియమించుకుంటారు. ప్రధానంగా క్విక్కర్, ఓఎల్ఎక్స్‌తో పాటు ఫుడ్ డెలివరీ సైట్లను మోసాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఎంచుకుంటున్నారు. టోల్‌ఫ్రీ నంబర్లు, కస్టమర్ కేర్ సెంటర్లకు కాల్ చేసిన వారిని ఈజీగా ట్రాప్ చేసే విధంగా టెలీ కాలర్స్‌కు ట్రైనింగ్ ఇస్తున్నారు. అనుమానం రాకుండా ఉండేందుకు ఆయా కంపెనీల పేరుతో ఓటీపీ మెసేజ్ పంపిస్తున్నారు. మెసేజ్‌లో వచ్చిన నంబర్ చెప్పగానే ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ చేస్తున్నారు. బాధితులు సైబర్ క్రైమ్ పోలీసులను వెంటనే ఆశ్రయిస్తే పరిష్కారం దొరికే అవకాశం ఉంటుందని పోలీసులు చెప్పారు. ఈ-కామర్స్ వెబ్‌సైట్లలో సెక్యూరిటీ ఫీచర్స్ వాడటంతోపాటు టోల్‌ఫ్రీ నంబర్లు, ఫేక్ కస్టమర్ కేర్ నంబర్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

అడ్రస్.. నీళ్లు అడిగి.. తులం బంగారు గొలుసు తస్కరణ

ముఖానికి మాస్క్‌తో దొంగతనం చేసిన వ్యక్తి(పోలీసులు విడుదల చేసిన చిత్రం)

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 12: వేకువజామున ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి తాగడానికి నీళ్లు అడగగా.. గుడ్డిగా నమ్మిన ఓ మహిళ ఇంట్లోకి వెళ్లగానే .. ఆమె మెడలోని బంగారు గొలుసును తస్కరించి పారిపోయిన సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల తెలిపిన ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ 3వ రోడ్డు ఈడబ్ల్యూఎస్ 998లో బాపట్ల కు చెందిన అంజలి(50) భర్తతో కలిసి నివసిస్తున్నది. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి ఇంటికి వచ్చి .. మహిళను మొదట అడ్రస్ అడిగి.. తర్వాత దాహం వేస్తున్నది నీళ్లు కావాలని అడిగాడు. వాడి మాటలు నమ్మిన ఆ మహిళ ఇంట్లోకి వెళ్లగానే అతను కూడా వెంట వెళ్లి ఆమె మెడలోని తులం బంగారు గొలుసును తస్కరించి పారిపోయాడు. ఆమె చెప్పిన వివరాలు.. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా...గొలుసు దొంగిలించిన వ్యక్తి ముఖానికి మాస్క్ వేసుకొని ఉన్నాడు. అతడి ముఖం ఫొటోను విడుదల చేసిన పోలీసులు.. దొంగతనం చేసిన వ్యక్తి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. అంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంక్ క్యాషియర్ చేతివాటం

- జమ చేయమంటే.. జేబులో వేసుకున్నాడు
- ఖాతాదారుడి రూ.25 వేలు కొట్టేసిన క్యాషియర్
- బ్యాంక్ సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాలు
- పోలీసులకు ఫిర్యాదు, కేసు నమోదు

వెంగళరావునగర్, మార్చి 12: కంచే చేను మేసిన చందంగా ఉన్నది బ్యాంక్ అధికారి తీరు. ఖాతాలో డబ్బు జమ చేయాలని డబ్బిస్తే.. జేబులో వేసుకుని చేతివాటం ప్రదర్శించాడు బ్యాంక్ క్యాషియర్. సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం..అమీర్‌పేట్‌లోని సౌత్ ఇండియా బ్యాంక్ లిమిటెడ్‌లో డబ్బు జమ చేసేందుకు ఖాతాదారుడు వల్లభనేని హరీశ్‌బాబు రూ.50 వేలు డబ్బుతోపాటు పే స్లిప్ ఇచ్చారు. తన అకౌంట్‌కు రూ.25,000 తన అకౌంట్‌కు రూ.25,000 జమ చేయాలని క్యాషియర్‌కు ఇచ్చాడు.అందులో రూ.25వేలు మాత్రమే అకౌంట్‌లో జమ చేసి సగం డబ్బు రూ.25వేలను క్యాషియర్ ఆదర్శ పరిహార్ తన జేబులో వేసుకున్నాడు. తన అకౌంట్‌లో డబ్బు జమ కాకపోవడంతో ఖాతాదారుడు హరీశ్ బ్యాంక్ మేనేజర్ మితున్ పచేరి మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అంతర్గత విచారణ చేపట్టారు. బ్యాంకు సీసీటీవీ కెమెరాల్లో క్యాషియర్ డబ్బు జేబులో వేసుకున్నట్లు ఆధారాలు దొరికాయి. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్యాషియర్ రూ.25వేలు కాజేసి తన జేబులో వేసుకోవడం సీసీ కెమెరాల్లో రికార్డ్ ఉందని ఫిర్యాదు చేయడంతో మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్పోర్ట్స్ అథారిటీలో 63 కోచ్ పోస్టులు భర్తీ చేయాలి

- సీఎంకు కోచ్ సంఘం విజ్ఞప్తి
- స్పోర్ట్స్ అథారిటీ 136 మంది కోచ్‌లకు గ్రేడ్-3 ఉద్యోగాలుగా నియమించాలి
- ఇతర శాఖలో నియామకాలు క్రీడా శాఖకు సవతి తల్లి ప్రేమ

హైదరాబాద్, ఆట ప్రతినిధి, మార్చి 12: జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌ల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని కోరుతూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ కోచ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జే.రాజశేఖర్ రెడ్డి బుధవారం రవీంద్రభారతిలో ఒక వినతిపత్రం అందజేశారు. ఆర్థిక శాఖ అనుమతినిచ్చిన తెలంగాణ కోచ్‌లకు సంబంధించిన 67 పోస్టుల్లో కేవలం నలుగురే ఉన్నారని, ఖాళీగా ఉన్న 63 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీలో బాధ్యతలు నిర్వహిస్తున్న 136 కోచ్‌లను నియమిస్తూ మరో 330 మంది కోచ్‌ల నియామకం కోసం ఫైనాన్స్ అప్రూవల్ నోటిఫికేషన్లకు సిద్ధం చేసిన అప్పటి క్రీడా ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానా సిద్ధం చేసిన ఫైల్‌ని కాదని ప్రస్తుతం కేవలం 38 మంది కోచ్‌ల ఇతర సిబ్బంది 136 తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఉన్నత అధికారులు ప్రభుత్వానికి పంపించడం పట్ల కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఒలింపిక్‌లో పథకాలు సాధించడమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు పోతున్న ఈ తరుణంలో ప్రస్తుత పర్మినెంట్ కోచ్‌లు నలుగురు, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీలో 25 ఏండ్లకు పైగా బాధ్యతలు నిర్వహిస్తున్న కోచ్‌లు.. ప్రస్తుతం ఏ-గ్రేడ్‌లో 28 మంది కోచ్‌లు డీఎస్ఓ పోస్టుల, అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ డైరెక్టర్‌లుగా పదవులను నిర్వహిస్తున్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీలో 63 మంది కోచ్‌ల ఖాళీలు ఉన్నా ఒక్కరిని కూడా నియమించక పోవడం గమనార్హం. స్పోర్ట్స్ అథారిటీలో 136 మంది జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు కోచ్‌లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జాతీయ అంతర్జాతీయ క్రీడాకారులు కాబట్టి 74 మిగతా కోచ్‌లను జీవో నంబర్ 5 ద్వారా నియమించాలని కోరారు.

కల్తీ వస్తువుల తయారీ కేంద్రంపై ఎస్ఓటీ పోలీసుల దాడి

పోలీసులు సీజ్ చేసి కల్తీ వాషింగ్ పౌండర్లు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 12: అక్రమంగా కల్తీ వస్తువులను తయారు చేసి మార్కెట్‌లో చలామనీ చేస్తున్న కేంద్రంపై రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో వివిధ రకాల కిరాణా వస్తువుల సీజ్ చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడని స్వాధీనం చేసుకున్న మిషనరీ, సామగ్రిని ఎస్ఓటీ పోలీసులు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మధుబన్‌కాలనీలో వీరేంద్ర ఘొష్లాట్ గదిని అద్దెకు తీసుకొని అందులో కల్తీ వస్తువులు ఒరిజినల్ అన్నట్లుగా ప్యాకింగ్ చేసి మార్కెట్‌లో విక్రయాలు కొనసాగిస్తున్నాడన్నారు. స్టాపూస్, వాషింగ్ పౌండర్, టీ పొడర్లు వివిధ వినియోగ వస్తువులపై లేబుల్స్‌ను ఉపయోగించుకుంటున్నారన్నారు. ఈ మేరకు హిందూస్తాన్ యూనిలివర్ కంపెనీ మేనేజర్ ఖలీల్ అహ్మద్ ఎలాంటి అనుమతులు లేకుండా వస్తువులను తయారు చేసి తమ లేబుల్స్‌ను ఉపయోగిస్తున్నారని ఫిర్యాదు చేశాడన్నారు. నిందితుడు వీరేంద్ర ఘొష్లాట్ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నామని వెల్లడించారు. ప్యాకింగ్ మెటీరియల్, స్మాల్ మిషనరీ, మెటీరియల్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. కాపీ రైట్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బంజారాహిల్స్‌లో దారిదోపిడీ

ట్రాన్స్‌జెండర్‌తో కలిసి డబ్బులు లాక్కున్న స్కూటీ గ్యాంగ్

బంజారాహిల్స్,మార్చి 12: రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని అటకాయించి దాడికి పాల్పడటంతో పాటు దారిదోపిడీకి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. కర్నూల్‌కు చెందిన షేక్ రఫీ(24) అనే యువకుడు బంజారాహిల్స్ రోడ్ నం.10లోని జహీరానగర్‌లో నివాసం ఉంటూ బంజారాహిల్స్‌లోని లెవంట్ హోటల్‌లో హెల్పర్‌గా పనిచేస్తుంటాడు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత డ్యూటీ ముగించుకున్న షేక్‌రఫీ బంజారాహిల్స్ రోడ్ నం.2లోని అన్నపూర్ణ స్టూడియో వైపు నుంచి టీడీపీ భవన్ వైపు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి స్కూటీపై వచ్చిన ముగ్గురు యువకులు అతడిని అడ్డగించి దాడికి పాల్పడ్డారు. గొడవ ఆపేందుకు యత్నిస్తున్నట్లు నటించిన ఓ ట్రాన్స్‌జెండర్ రఫీ జేబులోని రూ.1500 తీసుకుని వెళ్లిపోయింది. ఆ తర్వాత ముగ్గురు యువకులు రఫీ చేతిలో ఉన్న ఫోన్, రూ.12వేల నగదును లాక్కున్నారు. జీతం డబ్బులు కొత్త ఫోన్‌కు తీసుకెళ్తుండగా.. పాత ఫోన్‌ను దుండగులు లాక్కున్నారని బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీరంతా ముఠాగా దోపిడీకి పాల్పడి ఉండవచ్చని బాధితుడు పేర్కొన్నాడు. పోలీసులు బీఎన్ఎస్ 309(6)సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగానికి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి

బండ్లగూడ, మార్చి 12. ఉత్తరప్రదేశ్ మదురై నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపిన ప్రకారం... ఉత్తరప్రదేశ్ మదురై నుంచి దేవి చరణ్(42)హైదరాబాదులోని తన స్నేహితుడైన దేవేందర్ కుమార్ వద్దకు బతుకుదెరువు కోసం వచ్చాడు. కాగా, దేవేందర్ ఉద్యోగం దొరికేంత వరకు తన వద్ద ఉన్న చెరుకు రసం బండి వద్ద పని చేసుకోవాలని సూచించాడు. ఈ నేపథ్యంలో దేవిచరణ్ అక్కడ పని చేస్తూ అతడితోనే ఉంటున్నాడు. ఇదిలా ఉంటే దేవి చరణ్ సోమవారం అర్ధరాత్రి చెరుకు బండి మూసేసి ఇంటికి వెళ్లకుండా రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న రహదారిపై నిద్రించారు. కర్ణాటక చెందిన ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని నడిపి అతడి మీదుగా పోనిచ్చాడు. దీంతో దేవిచరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దేవేందర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేపడుతున్నారు.

చదివేది ఇంజినీరింగ్.. చేసేది గంజాయి వ్యాపారం

సిటీబ్యూరో, మార్చి 12 (నమస్తే తెలంగాణ): తాజెడ్డ కోతి వనమంతా చెర్చింది అన్న చందంగా తాను మత్తుకు అలవాటు పడింది కాకుండా తోటి విద్యార్థులకు కూడా గంజాయి విక్రయిస్తున్న ఒక ఇంజినీరింగ్ విద్యార్థిని ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 1.368 కేజీల గంజాయితోపాటు బైక్, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసుల కథనం ప్రకారం... కోరుట్ల ప్రాంతానికి చెందిన రాజు ఘట్‌కేసర్‌లోని ఓ ఇంజినీరింగ్ కాలేజిలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అయితే చెడు వ్యసనాలకు అలవాటు పడిన రాజు గంజాయికి బానిసగా మారి, డబ్బు కోసం దానినే వృత్తిగా మార్చుకున్నాడు. ఏకంగా తాను చదువుతున్న కళాశాలలోనే తోటి విద్యార్థులకు గంజాయి విక్రయించడం మొదలుపెట్టాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ పోలీసులు బుధవారం బీదర్ నుంచి గంజాయి తీసుకువచ్చి కళాశాలలో విక్రయిస్తున్న రాజును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును ఘట్‌కేసర్ ఆబ్కారీ పోలీసులకు అప్పగించారు. ఈ కేసును ఛేదించిన వారిలో సీఐ భిక్షారెడ్డి, ఎస్సైలు బాలరాజు, కానిస్టేబుళ్లు యాదగిరి, అనిఫ్, నితిన్, శ్రీనివాసరెడ్డి, శంకర్, అరుణ్ తదితరులు ఉన్నారు.

నిందితుడు రాజును అదుపులోకి తీసుకున్న పోలీసులు

జైలుకు వెళ్లొచ్చినా బుద్ధి మారలేదు

చోరీ చేసిన సొత్తును చూపెడుతున్న డీసీపీ బాలస్వామి, ఇతర పోలీసు అధికారులు

- సెంచరీ చోరీల శంకర్ నాయక్ అరెస్ట్
- పీడీ యాక్టు నమోదైనా మారని వైనం

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 12: చెడు వ్యసనాలకు అలవాటుపడి పందుకు పైగా దొంగతనాలకు పాల్పడిన శంకర్ నాయక్ (32) అనే కరడుగట్టిన దొంగను ఓయూ పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీ కేసులో అరెస్ట్ అయి జైలుకు వెళ్లి వచ్చిన 15 రోజుల్లో నాలుగు చోరీలు చేసి తన ప్రతిభ చాటుకున్నాడు. గతంలో పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపినా తన తీరు మార్చుకోలేదు. ఓయూ ఏసీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ నరసయ్య, సీఐ రాజేందర్‌తో కలిసి డీసీపీ డాక్టర్ బాలస్వామి వివరాలు వెల్లడించారు. నాగర్ కర్నూల్ జిల్లా వీపనగండ్ల మండలం తుమ్ముకుంట గ్రామం నాగర్లబండ తండాకు చెందిన రత్లావత్ శంకర్ నాయక్ గద్వాల్లో బీఫార్మసీ చదువుతుండగా.. ఓ హత్యాయత్నం కేసులో 2012లో జైలుకు వెళ్లివచ్చాడు. జైలు నుంచి విడుదలైన అనంతరం మద్యం, సిగరెట్లు, గంజాయి వంటి వ్యసనాలకు అలవాటు పడి, రాత్రుళ్లు బయట తిరిగేవాడు. అతడి జల్సాలకు తన సంపాదన సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో చోరీలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో రాజేశ్ రెడ్డి, రంగారావు, లియాజాఖాన్ తదితర పేర్లతో చలామణి అయ్యాడు. కాలనీలు, వివిధ ప్రాంతాల్లో పగలు తాళం వేసి ఉన్న ఇండ్లను గమనించి, రాత్రి సమయాల్లో ఐరన్ రాడ్ సాయంతో చాకచక్యంగా తలుపు తెరిచి దొంగతనానికి పాల్పడేవాడు. 2022 సెప్టెంబర్‌లో మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి పాల్పడి, పోలీసులకు చిక్కడంతో పీడీ యాక్టు నమోదు చేసి జైలుకు పంపారు. బయటకు వచ్చినా తిరిగి దొంగతనాలు చేస్తూ పోలీసులకు చిక్కడంతో మళ్లీ జైలు పాలయ్యాడు. అలా పలుమార్లు జైలుకు వెళుతూ దొంగతనాలకు పాల్పడుతూ ఉన్నాడు. ఈ క్రమంలో గత నెలలో జైలు నుంచి విడుదలైన శంకర్ నాయక్ తన వైఖరిని మార్చుకోక 15 రోజుల వ్యవధిలో నాలుగు దొంగతనాలు చేశాడు. వాటిలో ఒకటి ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో కాగా, మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, పటాన్‌చెరువు పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చొప్పున ఉండటం గమనార్హం. ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని హబ్సిగూడలో నివాసముండే రాంజీ తన కుటుంబంతో సహా ఈనెల 1న మేడ్చల్‌లోని బంధువుల నివాసానికి వెళ్లి, 2న తిరిగివచ్చే సమయానికి ఇళ్లు తాళం తీసి ఉండటంతో పాటు సామన్లన్నీ చిందరవందరగా పడి ఉండటం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోని 8 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసు విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు చోరీ జరిగిన విధానం, ఫింగర్ ప్రింట్లు సేకరించి శంకర్ నాయక్ నేరం చేశారని నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో నిందితుడు బుధవారం ఉదయం ఎల్బీనగర్‌లో సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్ తరలించి, విచారించగా తన నేరాలను ఒప్పుకున్నాడు. శంకర్ నాయక్ చోరీ విధానం చూసి పోలీసులు సైతం అవాక్కయ్యారు. తాను చోరీ చేసిన ప్రదేశంలో అక్కడ దొంగతనం చేసిన వస్తువుల వివరాలను ఒక చీటీలో రాసి అక్కడ వదిలేవాడు. చీటీ దొరకని పక్షంలో గోడపై వివరాలను రాసేవాడు. అంతేకాకుండా, అన్ని చోరీల వివరాలు, అక్కడ చోరీ చేసిన వస్తువుల వివరాలను డైరీలో ఎప్పటికప్పుడు పొందుపర్చడం గమనార్హం. గతంలో ఒక చోరీ చేసిన సమయంలో అక్కడ ఏమీ లభించకపోయినా ఐదు తులాల బంగారు ఆభరణాలు పోయాయని ఇంటి యజమాని ఫిర్యాదు చేయడం, పోలీసులు తన నుంచి రికవరీ చేయడంతో అప్పటి నుంచి ఈ అలవా